సాక్షి నంద్యాల
మంగళవారం : 24 : డిసెంబర్ : 2024



అన్నప్రసాద వితరణకు విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ పథకానికి సోమవారం ఏలూరు పట్టణానికి చెందిన టి.వెంకట నాగేశ్వరమ్మ రూ. లక్ష విరాళం అందజేశారు.



చౌడేశ్వరిదేవికి వెండి పళ్లెం

బనగానపల్లె రూరల్: నందవరంలో చౌడేశ్వరిదేవికి అనంతపురం జిల్లా జ్యోతిర్మయి కుటుంబ సభ్యులు సోమవారం 897 గ్రాముల వెండి పళ్లెంను విరాళంగా అందజేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,628
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 86.713
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 933
అవుట్ ఫ్లో	: 7,409

న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా మల్లన్న వెండి రథోత్సవం



స్వామిఅమ్మవార్లకు వెండిరథోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు,అధికారులు

శ్రీశైలంటెంపుల్: జ్యోతిర్లింగక్షేత్రమైన శ్రీశైలంలో భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం వెండిరథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్చారణలతో పూజలు నిర్వహించారు. సహస్ర దీపార్చన సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆశీనులను చేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీగిరికి పోటెత్తిన భక్తులు



మల్లన్న దర్శనానికి క్యూలో నిల్చున భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనానికి సోమవారం భక్తులు పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వేకువజామున పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లికార్జునస్వామిని ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా దర్శించుకున్నారు. పలువురు ఆన్‌లైన్ ద్వారా టికెట్లు పొంది స్వామివారి స్పర్శ దర్శనం నిర్వహించుకున్నారు. కాగా భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్నీ కిటకిటలాడాయి.

జీవన ప్రమాణాల మెరుగే లక్ష్యం



మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ లక్ష్మీకాంతం

నంద్యాల: పేద ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు పెంపొందించడమే సుపరిపాలన వారోత్సవాల ముఖ్య లక్ష్యమని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి లక్ష్మీకాంతం అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో సుపరిపాలన వారోత్సవాలపై వర్క్ షాప్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి, డీఆర్ఓ రామునాయక్ తదితర జిల్లా అధికారులు హాజరైన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ లక్ష్మీకాంతం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ 25న మాజీ ప్రధాని వాజ్ పేయి జన్మదినాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా సుపరిపాలన వారోత్సవాలు నిర్వహిస్తోందన్నారు. ఏ ప్రభుత్వమైనా ప్రజలకు జవాబుదారితనంతో, అత్యంత పారదర్శకంగా సేవలు అందించాలన్నారు. సుస్థిర అభివృద్ధి సంబంధించిన 17 అంశాలు అధిగమించేందుకు కృషి చేయాలన్నారు.

రబీ పంటలకు వారబందీ పద్ధతిలో నీటి విడుదల


నంద్యాల(అర్బన్): రబీ పంటలకు వారబందీ పద్ధతిలో నీటిని విడుదల చేయనున్నట్లు జలవనరుల శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ సుబ్బారాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెలుగోడు రిజర్వాయర్‌లో 12వేల టీఎంసీ నీటి నిల్వలు మాత్రమే ఉన్నాయని, రబీ పంటలకు వదిలే నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. తెలుగుగంగ కాల్వ పరిధిలో 1,24,459 ఎకరాల ఆయకట్టుకుగాను రబీలో 84 వేల ఎకరాల ఆయకట్టు తరుతడి పంటలకు మాత్రమే వచ్చే ఏడాది మార్చి వరకు వారబందీ పద్ధతిలో నీటి విడుదల జరుగుతుందన్నారు.

31లోపు ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజు చెల్లించండి

కర్నూలు సిటీ: ఓపెన్ స్కూల్ ద్వారా పదవ తరగతి, ఇంటర్మీడియెట్ చదువుతున్న వారు ఈ నెల 31వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్ తెలిపారు. సోమవారం నుంచి ఫీజులు చెల్లించే ప్రక్రియ మొదలైందన్నారు. టెన్త్ పరీక్షలకు రూ.5 రిజిస్ట్రేషన్ ఫీజు రూ.95 పరీక్ష ఫీజు, ఇంటర్మీడియెట్ థియరీ పరీక్షలకు రూ.5 రిజిస్ట్రేషన్, రూ.145 పరీక్ష ఫీజు, ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు ఒక సబ్జెక్టుకు రూ.95 ప్రకారం ఏపీ ఆన్‌లైన్‌లో ఫీజులు చెల్లించాలన్నారు.

అంతా కల్తీ.. అంతంతే తనిఖీ!

- విచ్చలవిడిగా ఆహార పదార్థాల కల్తీ
- హానికరమైన రంగులు, రసాయనాల వినియోగం
- కుళ్లిన మాంసంతో హోటళ్లలో వంటకాలు
- జోరుగా బ్రాండ్‌ను పోలిన నకిలీ వస్తువుల విక్రయాలు
- అధికారులు నామమాత్రపు తనిఖీలు
- ప్రజారోగ్యానికి పొంచి ఉన్న ముప్పు



రోడ్డు సైడ్ వేడి వేడి చికెన్ పకోడా నోరూరిస్తుందని.. ఘుమఘుమలాడే బిర్యానీ తినాలని జిహ్వ లాగుతుందని.. చిరుతిండ్ల ప్యాకింగ్ ఆకర్షణీయంగా ఉందని.. పండ్లు చూడగానే కొనాలనిపిస్తున్నాయని తీసుకుంటే అనారోగ్యం కొనితెచ్చుకున్నట్టే. డబ్బుకు కక్కుర్తి పడి కొందరు వ్యాపారులు ప్రతి వస్తువునూ కల్తీ చేస్తున్నారు. దీంతో మార్కెట్‌లో తినేందుకు ఏది కొన్నా అవి ఎంత నాణ్యతగా ఉన్నాయో అర్థం గాని పరిస్థితి. ఆహార పదార్థాల్లో ఇందుగలదందు లేదనే విధంగా మమేకమైపోయింది కల్తీ. అసలు సరుకులో ఇమడగలిగితే చాలు తాగే పాల నుంచి ప్రతీదీ విషతుల్యం చేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు నామమాత్రపు తనిఖీలతో సరిపెట్టుకుంటున్నారు.

కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి జిల్లాలో దాదాపుగా చిన్నా పెద్దా హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు, చాట్, నూడుల్ షాపులు, కిరాణాదుకాణాలు, హోల్‌సేల్ దుకాణాలు, ఆయిల్ మిల్లులు, రిటైల్ విక్రయ కేంద్రాలు అన్నీ కలుపుకుని 30 వేల వరకు ఉన్నాయి. ఒక్క నంద్యాల పట్టణంలోనే వెయ్యి దాకా రెస్టారెంట్లు, హోటల్స్, మరో వెయ్యికి పైగా హోల్‌సేల్, రిటైల్ కిరాణా దుకాణాలు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి ఏటా రూ.వెయ్యి కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుందని అంచనా. సాధారణంగా ఈ దుకాణాలు ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల సంస్థ నుంచి లైసెన్స్ తీసుకోవాల్సి ఉంది. ఆ శాఖ నిబంధనల మేరకు ఆహారం తయారు చేయాలి. ఈ చట్టం 2006 నుంచి అమల్లో ఉంది. ఆ శాఖ పరిధిలో కర్నూలు జిల్లాలో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, ఓ గజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్, ఒక ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు నంద్యాల జిల్లాలో ఇద్దరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. వీరు గత మార్చి నుంచి అక్టోబర్ నెల వరకు 147 శాంపిల్స్ తీయగా అందులో 28 తినేందుకు పనికిరానివిగా నిర్ధారణ అయ్యింది. కాగా ప్రస్తుత అధికారులు వారి పరిధిలో నెలకు 12 చొప్పున శాంపిల్స్ సేకరించాలి. అయితే, సిబ్బంది కొరత కారణంగా అధికారులు తక్కువ శాంపిల్స్ తీస్తున్నారు. ప్రతి దుకాణంలో శాంపిల్ తీసి ల్యాబోరేటరీకి పంపిస్తే మరిన్ని ఆహార పదార్థాల్లో లొసుగులు బయటపడే అవకాశం ఉంది.

అధిక శాతం అనుమతులే లేవు

ఆహారానికి సంబంధించి క్రయ, విక్రయానికి దుకాణం తెరవాలంటే ముందుగా కర్నూలు నగరంలోని సి.క్యాంపు సెంటర్‌లో ఉన్న ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల సంస్థ (ఫుడ్ కంట్రోలర్ ఆఫీసర్) నుంచి నిర్ణీత రుసుము చెల్లించి అనుమతి తీసుకోవాలి. జిల్లా మొత్తంగా ఇలా అనుమతి తీసుకుని వ్యాపారం చేసే సంస్థలు కేవలం 25శాతం లోపే ఉన్నాయి. మిగిలినవన్నీ అనుమతి లేకుండానే వ్యాపారాలు చేస్తున్నవే అన్న విషయం అధికారులకూ తెలుసు. అయినా, వాటి వైపు వారు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు ఉన్నాయి.



హోటల్‌లో ఆహార పదార్థాలు పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రాజగోపాల్ (ఫైల్)

➡ డోన్, శ్రీశైలం, నంద్యాల, బనగానపల్లెలలోని హోటళ్లలో ఎక్కువగా మరిగించిన నూనెను, నిషేధిత రంగులను, రసాయనాలను వాడినట్లు గుర్తించారు. వాటితో తయారు చేసిన ఆహార పదార్థాలు తింటే తీవ్ర అనారోగ్యానికి గురవుతారని నివేదికలో తేలింది.

➡ ఇటీవల నంద్యాల పట్టణంలోని శ్రీనివాస నగర్, పద్మావతి నగర్‌లలోని పలు హోటళ్లలో చికెన్ కర్రీ, తందూరి చికెన్ నాసిరకంగా ఉన్నట్లు అధికారులు గుర్తించి కేసులు ఫైల్ చేశారు

➡ హాలహర్విలోని ఓ దుకాణంలో నెయ్యి శాంపిల్ తీసి పరీక్షకు పంపగా ఇది పూర్తిగా కల్తీ అయ్యిందని తేలింది.అలాగే కల్లూరు ఎస్టేట్‌లోని ఓ నూనె మిల్లులో తయారు చేసే రిఫైన్డ్ కుకింగ్ ఆయిల్ ఆహారానికి పని కిరాదని అధికారులు గుర్తించారు.

➡ పాములపాడులోని ఓ కిరాణా దుకాణంలో కందిపప్పు నాణ్యత లేదని తేలడంతో కేసు నమోదు చేశారు.

ఆహార పదార్థాల కల్తీ ఇలా..

- ➤ పాలల్లో చిక్కదనం కోసం నాసిరకం పాలపౌడర్లు, యూరియా, పిండి, నూనె కలుపుతున్నారు.
- ➤ టీ పొడిలో ఇనుప రజను, రంపపు పొట్టును మిశ్రమం చేస్తున్నారు. దీనివల్ల ఊపిరితిత్తులు పాడై పోయే ప్రమాదం ఉంది.
- ➤ వంటనూనెల్లో తక్కువ ధరలకు లభించే నూనెలను కలిపి విక్రయిస్తున్నారు.
- ➤ చికెన్, మటన్ బిర్యానీలు, తందూరి చికెన్‌లలో ఆకట్టుకునేందుకు గాను ఎక్కువగా హానికర రంగులను వాడుతున్నారు. అనారోగ్యానికి గురైన, ప్రమాదాల్లో చనిపోయిన గొర్రెలు, పొట్టేళ్లు, మేకలను వధించి వినియోగదారులకు విక్రయిస్తున్నారు.
- ➤ కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లలో నాలుగైదు రోజుల పాటు మాంసాన్ని ఫ్రిడ్జ్‌లో నిల్వ ఉంచి ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారు.
- ➤ నిషేధిత క్యాట్‌ఫిష్‌లను కర్నూలు, నంద్యాలలో అమ్ముతున్నా అడిగే నాథుడు లేరు. కొందరు క్యాట్‌ఫిస్‌లను చెరువులు, నదుల్లో చికెన్, మటన్ వ్యర్థాలు వేసి పోషిస్తున్నారు.
- ➤ మిరపకాయల్లో ఎరుపు రంగు రావడానికి సూడాన్ రంగులు వాడుతున్నారు. పసుపులో మెటానిల్ ఎల్లో అనే పదార్థాన్ని, అల్లం, వెల్లుల్లి పేస్టుల్లో ఆలు, ఉల్లిగడ్డ పేస్టు కలుపుతున్నారు. దీనిని వంటలో వినియోగిస్తే క్యాన్సర్ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది.



అంతటా అపరిశుభ్రతే...!

పెద్ద హోటళ్లు, రెస్టారెంట్లు మినహా అధిక శాతం హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రోడ్డుపైడు హోటళ్లలో పరిశుభ్రత గురించి అస్సలు పట్టించుకోవడం లేదు. కస్టమర్లకు ఆహారం అందించడంలోనూ నిర్లక్ష్యం చూపుతున్నారు. ఏ ఒక్కరూ చేతులకు గ్లౌజులు, తలకు టోపీలు, ముఖానికి మాస్క్ ధరించడం లేదు. వంటగదుల్లో పరిశుభ్రత గురించి ఎంత తక్కువగా చెప్పుకుంటే అంత మంచిది. రెస్టారెంట్లు, హోటళ్లలో నాసిరకం ఆహార పదార్థాలు వాడుతూ, రోజుల తరబడి నిల్వ ఉన్న మాంసాన్ని వండి వడ్డిస్తున్నారు.

తనిఖీలు నిర్వహిస్తున్నాం



ఆహారంలో కల్తీని నివారించేందుకు మా బృందంతో ఇటీవల కాలంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాము. కల్తీ జరిగిందని, నాసికరంగా, ఆహారానికి పనికిరానివిగా ఉన్నట్లు తేలితే అలాంటి వ్యాపారులపై కేసులు నమోదు చేస్తున్నాము. ఇంకా ఎవ్వరికైనా ఆహారంలో కల్తీ జరిగిందని, నాసిరకమైన పదార్థాలను విక్రయించారని అనిపిస్తే సి.క్యాంపులోని మా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చు. విచారణ చేసి కల్తీవైతే చర్యలు తీసుకుంటాము. ఆహార పదార్థాలను విక్రయించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలి.

– కె. కూర్మానాయకులు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, ఉమ్మడి కర్నూలు జిల్లా

కల్తీ ఆహారంతో జీర్ణకోశ వ్యాధులు



కల్తీ పదార్థాల తయారు చేసిన ఆహారం తింటే జీర్ణకోశ వ్యాధులు వస్తాయి. క్రమంగా క్యాన్సర్‌కు కూడా దారి తీస్తుంది. కొన్ని హోటళ్లలో బిర్యానీలో మంచి రంగు కోసం మెటానియల్ ఎల్లో, టార్ట్రాజిన్ రసాయనాలు, రుచి కోసం టేస్టింగ్ సాల్ట్ కలుపుతున్నారు. రోడ్లపై, మురికికాలువల పక్కన ఏర్పాటు చేసే ఫాస్ట్‌ఫుడ్ తినే వారిలో టైఫాయిడ్ జ్వరం, పసిరికలు వస్తాయి.

– డాక్టర్ సరయూరెడ్డి, జనరల్ ఫిజీషియన్, కర్నూలు

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించండి

- అధికారులకు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ప్రజా సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలతో వచ్చిన వారి నుంచి కలెక్టర్ వినతులు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలను క్షుణ్ణంగా విని మానవతా దృక్పథంతో నాణ్యమైన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో పలు అర్జీలు జిల్లా కలెక్టర్ లాగిన్‌లో రీ ఓపెన్ అవుతున్నాయని చెప్పారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించి ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన విశ్లేషణాత్మక నివేదికలను ప్రతి అధికారి చదివి లోపాలను సరి చేసుకోవాలన్నారు. అర్జీదారుడు ఇచ్చిన అర్జీని వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు సంబంధిత డాక్యుమెంట్లను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలన్నారు. ఇంగ్లిషులో కాకుండా తెలుగులో పూర్తిస్థాయి వివరణలు ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 2,673 ప్రజా సమస్యలను నిర్ణీత కాల వ్యవధిలోగా పరిష్కరించాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద ఇంకా 20 లక్షల పది దినాల లక్ష్యాన్ని అధిగమించాల్సి ఉందని చెప్పారు. లేబర్ బడ్జెట్ పెరిగితే తప్ప సీసీ రోడ్లు, పశువుల షెడ్లు మంజూరు కావన్నారు. కార్యక్రమంలో 248 మంది తమ సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, డీఆర్ఓ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డీ నోటిఫై పత్రాలు అందజేత

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించి వాటికి సంబంధించిన క్లియరెన్స్ పత్రాలు రైతులకు అందజేస్తున్నామని జిల్లా కలెక్టర్ రాజు కుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో అర్హులైన రైతులకు డీ నోటిఫై పత్రాలు పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భూ నిషేధిత జాబితాలో ఉన్న చుక్కల భూములు, డీ పట్టా భూములకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం చూపామన్నారు.

ప్రభుత్వం స్పందించే వరకు ఆందోళన



బేతంచెర్లలో నిరసన తెలుపుతున్న లారీ, ట్రాక్టర్, క్వారీ యజమానులు, కార్మికులు

బేతంచెర్ల: ప్రభుత్వం రాయల్టీ సమస్య పరిష్కరించే వరకు ఆందోళన విరమించమని నాపరాయి రవాణా చేసే లారీ, ట్రాక్టర్ యజమానులు, క్వారీ నిర్వాహకులు హెచ్చరించారు. సోమవారు వారు పట్టణంలోని బనగానపల్లె రైల్వే గేటు భూగర్భ గనుల శాఖ రాయల్టీ చెక్ పోస్టు సమీపంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో రాయల్టీలు రాకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. చెక్‌పోస్టుల వద్ద అధికారులు వాహనాలు ఆపి రాయల్టీలు చూపించాలని అడుగుతున్నారన్నారు. ఇప్పటికే కష్టాల్లో ఉన్న నాపరాతి పరిశ్రమపై కన్సిడరేషన్ ఫీజు పెంపు ద్వారా సర్కారు మరింత భారం వేసిందన్నారు. ఈ ప్రభావం రాయల్టీపై పడిందన్నారు. బనగానపల్లె మండలం పలుకూరు, రామకృష్ణాపురం గ్రామాల పరిధిలోని క్వారీల నుంచి బేతంచెర్ల పట్టణంలోని సుమారు 400 పరిశ్రమలకు ముడి సరుకును వాహనాల్లో తరలిస్తారు. రాయల్టీలు లేకపోవడంతో వాటిని అధికారులు అడ్డుకుంటున్నారన్నారు. దీంతో నాపరాతి పరిశ్రమపై ఆధారపడి జీవించే తమ కుటుంబాలు రోడ్డున పడాల్సి వస్తుందని వాపోయారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు



సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ

బొమ్మలసత్రం: 'కొత్తపల్లి గ్రామానికి చెందిన లోకేష్‌తో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. పెళ్లి సమయంలో కట్నం కింద 10 తులాల బంగారు ఆభరణాలు ఇచ్చారు. అయినా అదనపు కట్నం కోసం మెట్టినింటి వారు వేధిస్తున్నారు.. స్పందించి మీరే న్యాయం చేయాల'ని గోస్పాడు మండలకేంద్రానికి చెందిన నాగతులసి ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. డోన్ పట్టణానికి తల్లి నుంచి సంక్రమించిన ఆస్తిలో సగభాగం ఇవ్వకుండా మొత్తం తన తమ్ముడు రామ్మోహన్ అనుభవిస్తున్నాడని, అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నాడని డోన్ పట్టణానికి చెందిన రామచంద్రరావు ఎస్పీకి ఫిర్యాదు చేశాడు.అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా నుంచి మొత్తం 80 వినతులు వచ్చాయని, సమగ్ర విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. నిర్ణీత గడువులోగా ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో నలుగురు డిబార్

కర్నూలు కల్చరల్: ఆర్‌యూ పరిధిలో జరుగుతున్న డిగ్రీ పరీక్షల్లో భాగంగా సోమవారం నిర్వహించిన మొదటి సెమిస్టర్ పరీక్షల్లో నలుగురు డిబార్ అయ్యారు. గూడూరు ఎస్ఆర్ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో 4, డోన్ సాయి శ్రీ డిగ్రీ కళావాల పరీక్ష కేంద్రంలో ఒకరు చూచిరాతకు పాల్పడగా మొత్తం నలుగురు విద్యార్థులను డిబార్ చేసినట్లు తెలిపారు. మొదటి సెమిస్టర్ పరీక్షలకు 10,876 మందికి 9,616 మంది హాజరు కాగా 1260 మంది, మూడు, ఐదో సెమిస్టర్ల పరీక్షలకు 5,086 మందికి 4,600 మంది హాజరు కాగా 486 మంది గైర్హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 61 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయి. కర్నూలు నగరంలోని శంకరాస్ డిగ్రీ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య ఎన్‌టీకే నాయక్ ..సీఈ వెంకటేశ్వర్లుతో కలిసి సందర్శించారు.

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.3.56 కోట్లు



మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం హుండీ ఆదాయం రూ.3.56 కోట్లు సమకూరింది. సోమవారం శ్రీమఠం రాజాంగణ భవనంలో హుండీ లెక్కింపు చేపట్టారు. 25 రోజులకు గానూ రూ.3,56,04,597 వచ్చింది. అందులో నగదు రూ.3,46,84,817, నాణేలా రూపేణా రూ.9,19,780 సమకూరింది. అలాగే 64 గ్రాముల బంగారం, 1,900 గ్రాముల వెండి కానుకలు వచ్చాయి.

బండెడు చాకిరీ!

- సచివాలయాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై అదనపు భారం
- విద్యార్హతలు, సామర్థ్యానికి వ్యతిరేకంగా విధులు
- సంబంధం లేని పనులు చేయిస్తుండడంతో ఈఏల పరేషాన్



ఉమ్మడి జిల్లాలో సచివాలయాల వివరాలు....

జిల్లా	సచివాలయాలు	ఇంజినీరింగ్ అసిస్టెంట్లు
కర్నూలు	463	366
నంద్యాల	400	385
మొత్తం:	863	751

కర్నూలు(అర్బన్): గ్రామ/వార్డు సచివాలయాల్లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్ల పరిస్థితి ఆందోళనకరంగా తయారైంది. బీటెక్, ఎంటెక్ చదివి కష్టపడి పరీక్ష రాసి సచివాలయాల్లో ఉద్యోగాలు పొందిన ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తాము చేయాల్సిన పనులేంటో, చేస్తున్న పనులేంటో తెలియక తీవ్ర మానసిక వేదనను అనుభవిస్తున్నారు. రాష్ట్రంలో కూటమి సర్కార్ కొలువుతీరినప్పటి నుంచి ఇంజినీరింగ్ అసిస్టెంట్ల విద్యార్హతలు, సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకోకుండా వారి జాబ్ చార్ట్‌లో లేని పనులను అప్పగిస్తూ వారి మానసిక స్థైర్యాన్ని దెబ్బతీస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వీరికి ఒక ఉద్యోగానికి జీతం ఇస్తు వంద రకాల పనులను చేయిస్తున్నారు. టెక్నికల్ పనులతో పాటు నాన్ టెక్నికల్ పనులను కూడా వీరితోనే చేయిస్తుండడంతో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థతను ఏర్పాటు చేస్తూ పలు శాఖల ఉద్యోగులను నియమించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 863 సచివాలయాల్లో 751 ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు. నియామక సమయంలో జారీ చేసిన జాబ్‌చార్ట్‌ను కూటమి ప్రభుత్వం పక్కనబెట్టి అనేక రకాల సంబంధం లేని పనులు చేయిస్తుండడంతో పని ఒత్తిడికి గురవుతున్నారు. జాబ్ చార్ట్ ప్రకారం క్షేత్ర స్థాయిలో వివిధ ప్రభుత్వ ఇంజినీరింగ్ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను పూర్తి స్థాయిలో పర్యవేక్షించాల్సి ఉంది. అలాగే తమ పరిధిలోని ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు (సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్స్, బీటీ రోడ్లు, నీటి ట్యాంకుల నిర్మాణం, డ్రైనేజీ, గ్రామీణ నీటి సరఫరా తదితర వాటిని గుర్తించాల్సి ఉంది. గ్రామ సభ ఆమోదంతో గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్‌కు సంబంధించిన పనులకు అంచనాలను రూపొందించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ప్రకృతి వైపరీత్యాలు, తుపాన్లు, వరదలు సంభవించిన స మయాల్లో ఆర్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించిన ఓఅండ్ఎం స్టాఫ్‌తో కలిసి తాగునీటి పైప్‌లైన్లపై ప్రత్యేక దృష్టి సారించి ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. సమయానుకూలంగా తమ కాంపిటెంట్ అథారిటీ అధికారులు సూచించిన ఇతర పనులకు హాజరు కావాల్సి ఉంటుంది.

విధి నిర్వహణలో భాగంగా ...

' పల్లె పండుగ ' కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఉపాధి నిధులు రూ.67 కోట్లతో 830 పనులు (గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రహదారులు) చేపట్టారు. ఈ పనులు పూర్తి స్థాయిలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ల పర్యవేక్షణలోనే కొనసాగుతున్నాయి. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న ఈ పనులను ఈఏలు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. అలాగే ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, ఆర్‌అండ్‌బీ తదితర శాఖలకు చెందిన పనులను కూడా నిర్ణీత సమయంలోగా చేపట్టాలని ఆదేశాలు జారీ అవుతున్నందున ఈఏలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. హౌసింగ్‌లో తగినంత మంది సిబ్బంది లేని కారణంగా ఇంజినీరింగ్ అసిస్టెంట్లతోనే కాలం నెట్టుకొస్తున్నారు.

అదనపు పనులతో సతమతం ...

జాబ్‌చార్ట్‌లో ఉన్న విధంగా ఇంజినీరింగ్ పనులను చేస్తున్న ఈఏలకు ప్రభుత్వం సంబంధం లేని పనులను అంటగట్టడంతో సతమతమవుతున్నారు. ముఖ్యంగా ప్రతి నెలా తెల్లవారుజామున 6 గంటలకే పెన్షన్లు పంపిణీ చేయమని ఆదేశాలు జారీ చేశారు. అలాగే గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు చేయాల్సిన పనులకు (పీఆర్ 1 యాప్‌లో వివరాల అప్‌లోడ్) కూడా వీరినే పురమాయిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. రెవెన్యూ శాఖకు చెందిన ఉద్యోగులు నిర్వహించాల్సిన బీఎల్ఓ విధులను ప్రభుత్వ సెలవు దినాల్లో కూడా నిర్వహించాల్సి వస్తోందని ఈఏలు వాపోతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇంటింటి సర్వే, సిటిజన్ మిస్సింగ్ సర్వే, ఎంఎస్ఎంఈ సర్వే తదితరాలను కూడా తమతో చేయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



సీసీ రోడ్ల నిర్వహణపై అవగాహనకు హాజరైన ఇంజినీరింగ్ అసిస్టెంట్లు

క్లుప్తంగా

బీటెక్ విద్యార్థి బలవన్మరణం


నవీన్‌కుమార్ (ఫైల్)

ఆదోని అర్బన్: బీటెక్‌లో రెండు సబ్జెక్టులు ఫెయిల్ అయ్యాననే దిగులుతో విద్యార్థి నవీన్‌కుమార్(20) ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం రాత్రి కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి కాలనీలో చోటుచేసుకుంది. మృతుడి తండ్రి ఈరన్న టూటౌన్ పోలీసులకు తెలిపిన వివరాలు.. నవీన్‌కుమార్ స్థానిక ఓ ఇంజినీరింగ్ కళాశాలలో 3వ సంవత్సరం చదువుకుంటూనే సెల్‌ఫోన్ షాపులో పని చేస్తూ కుటుంబానికి చేయూతగా ఉన్నాడు. ఇటీవల వెలువడిన రెండో ఏడాది పరీక్ష ఫలితాల్లో రెండు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యాడు. ఈ విషయంలో దిగులు చెందుతూ ఉండేవాడు. ఆదివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఈరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

27న వాలీబాల్ ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 27 ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సీనియర్ మహిళలు, పురుషుల రాష్ట్ర స్థాయి వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న జిల్లా సీనియర్ వాలీబాల్ మహిళా, పురుష క్రీడాకారులు ఆధార్ కార్డు, నేటివిటీ, 10 ఫొటోలతో వాలీబాల్ కోర్టులో హాజరు కావాలన్నారు. అక్కడ ఎంపికైన క్రీడాకారులను వచ్చేనెల 7 నుంచి 13వ తేదీ వరకు రాజస్తాన్‌లోని జయపూర్‌లో నిర్వహించనున్నట్లు జాతీయ స్థాయి పోటీలకు పంపుతారన్నారు.

గొలుసు దొంగ అరెస్టు

కర్నూలు: మండలంలోని ఎల్.పేట ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పెంచలమ్మ పుస్తెల గొలుసును అపహరించిన దొంగను మూడో పట్టణ పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. నంద్యాల జిల్లా జూపాడు బంగ్లాకు చెందిన మద్దూరు వెంకటేశ్వర్లు ఈనెల 20న పెంచలమ్మ మెడలో బంగారు గొలుసు అపహరించాడు. పక్కా ఆధారాలతో వెంకటేశ్వర్లును సోమవారం గణేష్ నగర్ వక్కెరవాగు దగ్గర అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. అతన్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ శేషయ్య తెలిపారు.

మూగలదొడ్డిలో మొసలి కలకలం


మొసలిని బంధించిన దృశ్యం

కోసిగి: మండల పరిధిలోని మూగలదొడ్డి గ్రామ శివారు ఇళ్ల సమీపంలో మొసలి సోమవారం కలకలం రేపింది. మూలగదొడ్డి గ్రామం నుంచి కందుకూరు గ్రామానికి పొలాల వెంబడి అడ్డదారి ఉంది. మధ్యలో వంక ఉంది. తుంగభద్ర నది నుంచి వంక వెంబడి వచ్చి ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. అటువైపుగా పొలాలకు వెళ్లే రైతులు గమనించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని మొసలిని చూసి ఆందోళనకు గురయ్యారు. ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జయరాముడు, బీట్ ఆఫీసర్లు షమిఉల్లా, రామ్మోహన్, శంకర్ నాయక్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గ్రామస్తుల సహకారంతో పెద్దతాడుతో పట్టుకుని తుంగభద్ర నదిలో వదిలేయడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.


ఖాళీ జాగాలో బండలతో హద్దులు ఏర్పాటు చేసుకున్న దృశ్యం

దర్జాగా కబ్జా

- జగన్న కాలనీలో స్థలాలను ఆక్రమిస్తున్న టీడీపీ, జనసేన నేతలు
- ప్రజల సౌకర్యార్థం స్థలాలను వదలని వైనం

పేదోడి సొంతింటి కలను సాకారం చేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బృహత్తర కార్యం చేపట్టింది. కోట్లాది రూపాయలు వెచ్చించి భూములు కొనుగోలు చేసింది. ఊళ్లను తలపించేలా జగనన్న కాలనీలను నెలకొల్పింది. అలాంటి కాలనీల్లో టీడీపీ, జనసేనలు గద్దల్లా వాలిపోతున్నారు. ఖాళీ జాగాల్లో పాగాకు తెర తీశారు. పబ్లిక్ పర్పస్ స్థలాలతోపాటు అక్కడక్కడా పేదల ప్లాట్లను ఆక్రమించుకునే పనిలో పడ్డారు. రాత్రికి రాత్రే నాపరాళ్లను పాతుకుని పాగా జాతర చేసుకుంటున్నారు. అరికట్టాల్సిన అధికారులు అధికార దర్పానికి తలొగ్గి వేడుక చూడాల్సి వచ్చింది. – మంత్రాలయం

మంత్రాలయం నియోజకవర్గ కేంద్రంలో పాతికేళ్ల క్రితం పేదలకు పట్టాలిచ్చారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు పట్టణ వాసులకు ఇంటి స్థలాలు ఇవ్వలేక పోయాయి. దీంతో ఇక్కడి పేదలు గుడిసెల్లోనే కాపురాలు సాగిస్తూ వచ్చారు. పేదల ఇక్కట్లు తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని గత ప్రభుత్వం హయాంలో పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయించారు. రూ.కోటిన్నరతో భూములు కొనుగోలు చేసి దాదాపు 964 మేర ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. మంత్రాలయం – ఎమ్మిగనూరు జాతీయ రహదారికి తూర్పు దిక్కున, రాఘవేంద్ర పురం దక్షిణ భాగంలో రెండు జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారు. ఎమ్మిగనూరు రహదారి వైపు 271/3, 272/1, 272/4, 274/1 సర్వేనంబర్లలో 11.17 ఎకరాల్లో కాలనీ నిర్మించారు. అలాగే రాఘవేంద్రపురం దక్షిణ దిశలో 335/1 సర్వే నంబర్‌లో 4.89 ఎకరాల్లో మరో కాలనీ ఏర్పాటు చేశారు. ఆయా కాలనీల్లో ఇప్పటికే 60 శాతం పేదలు ఇళ్లు నిర్మాణాలు చేసుకున్నారు. ఇంకొన్ని ఇళ్ల నిర్మాణాలు సాగుతున్నాయి. కాగా 80 సెంట్లకుపైగా కాలనీవాసులు సౌకర్యార్థం స్థలాలు వదిలేశారు. సదరు స్థలాల్లో ముున్ముందు పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లు, హెల్త్‌సెంటర్లు, తాగునీటి ట్యాంకులు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉండేలా వదలడం జరిగింది.

ఖాళీ జాగాల్లో కబ్జాలు

జగనన్న కాలనీల్లో ఇళ్లు వెలియడంతో టీడీపీ, జనసేన మూకల కన్ను పడింది. కాలనీల్లో ప్లాట్ల విలువ సైతం అమాంతం పెరిగింది. అధికారం వచ్చింది కదా అని, తమదే రాజ్యమంటూ ఇరు పార్టీల చోటా సేనలు కబ్జాలకు దిగారు. ముందుగా కాలనీ సౌకర్యార్థం కేటాయించిన స్థలాలను టార్గెట్ చేసుకున్నారు. చేతనైన కాడికి ఖాళీ జాగాలో హద్దులు గీసుకుంటున్నారు. ఇప్పటికే ఎమ్మిగనూరు రోడ్డులోని కాలనీలో నాపరాళ్లను సిద్ధంగా ఉంచుకుని హద్దులు ఏర్పాటు చేసుకున్నారు. కొందరు ఏకంగా నాపరాళ్లను తెప్పించి పాతుకునే పనిలో పడ్డారు. రెండు కాలనీల్లోనూ ఇప్పటికే దాదాపు 80 సెంట్ల స్థలాలను ఆక్రమించుకున్నట్లు సమాచారం. సదరు స్థలాల విలువ ఎంతలేదన్నా రూ.2 కోట్లపైనే ఉంటుందని అంచనా. ఇదివరకే పేదలకు కేటాయించిన ప్లాట్లలోనూ నాపరాళ్లు పాతుకుంటున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఖాళీ ప్లాట్లను స్వాహా చేయాలనే ఉత్సుకత చూపుతున్నారు. ఆక్రమణదారుల ఆగడాలను చూసి ప్రజలు విస్తుపోతున్నారు. ఇలాంటి దౌర్జన్యాలు గతమెన్నడూ చూడలేదని చర్చించుకుంటున్నారు. ఇలా కబ్జా చేసుకుంటూ పోతే కాలనీ వాసుల అవసరాలకు స్థలాలు ఎక్కడ కేటాయిస్తారని ప్రశ్నిస్తున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి కబ్జాలను తొలగించాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు.

క్రిమినల్ కేసులు పెడతాం

జగనన్న కాలనీల్లో ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఇది వరకే హెచ్చరికలు జారీ చేశాం. అలాగే నడుచుకుంటే కబ్జా చేసిన వారిపై క్రిమినల్ కేసులు పెడతాం. ఏవైనా ఆక్రమణలు చోటుచేసుకుంటే కాలనీ వాసులు తమ దృష్టికి తీసురావచ్చు. ప్రభుత్వ ఆదేశాలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు.

– ఎస్.రవి, తహసీల్దార్, మంత్రాలయం

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కర్నూలు: కర్నూలు–దూపాడు రైల్వేస్టేషన్ల మధ్య 243/17–18 కిలోమీటర్ వద్ద రైలు పట్టాలపై గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. కర్నూలు రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ నాగరాజుకు స్థానికులు సమాచారం ఇవ్వడంతో రైల్వే పీఎస్ ఎస్‌ఐ కిరణ్ బాబు ఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. సోమవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి వాహనం కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు సమాచారం ఇచ్చారు. కాగా ఆచూకీ తెలిసినవారు 9440627654కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఎస్‌ఐ కోరారు.

చెట్టుకు ఉరి వేసుకుని మరో యువకుడు..

మంత్రాలయం: గుర్తు తెలియని ఓ యువకుడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొన్ని రోజులుగా మృతుడు మండల కేంద్రంలోకి కాగితాలు, ప్లాస్టిక్ వస్తువులు ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రాత్రిపూట గతంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లోనే బస చేసేవాడు. ఇటీవల రాత్రి పూట బయట ప్రాంతాల్లో బస చేస్తూ కనిపించాడు. ఆదివారం రాత్రి స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుటనే ఉన్న కట్టెల డిపోలో కానుగ చెట్టుకు ఉరి వేసుకున్నాడు. ఉదయం కట్టెల డిపో వారు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వీఆర్వో భీమన్న గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎ.ఆంజనేయులు తెలిపారు.

చెట్లను నరికిన వారిపై కేసు నమోదు

మంత్రాలయం: మండలంలోని కల్లుదేవకుంట గ్రామంలో చెట్లను నరికివేసిన ఘటనలో ఐదుగురిపి ఎమ్మిగనూరు కోర్టు ఆదేశాలతో పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామంలోని వీరభద్ర స్వామి జాతర సౌకర్యార్థం గ్రామానికి చెందిన స్వాతంత్ర సమరయోధుడు శివారెడ్డి 1932 జూన్ 5న అదే గ్రామానికి చెందిన కుచ్చలదిన్నె తాయమ్మ నుంచి 20 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేశాడు. అప్పటి నుంచి అదే స్థలంలో ఏటా స్వామి మహారథోత్సవం జరుపుతున్నారు. అప్పట్లో ఆ స్థలంలో 8 మొక్కలు నాటి పెద్ద చేసేవారు. దాదాపు 90 ఏళ్ల క్రితం మొక్కలు నాటడంతో అవి మహావృక్షాలు పెరిగి నీడనిస్తున్నాయి. అయితే తాయమ్మ వంశీకులు ఆ స్థలం తమదంటూ తరచూ యాగీ చేస్తూ వస్తున్నారు. ఈక్రమంలో టీడీపీ అధికారంలోకి రాగానే అక్టోబర్ 22న 6 వేప, 2 బసిరి చెట్లను నరికివేశారు. ఇది దౌర్జన్యమంటూ శివారెడ్డి మనవడు రాఘవరెడ్డి పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు పెట్టకుండా ఫారెస్టు అధికారులను ఆశ్రయించమని ఉచిత సలహా ఇచ్చారు. అప్పట్లో ఆదోని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అనురాధ ఘటన స్థలాన్ని పరిశీలించి జరిమానా విధించి చేతులు దులుపుకున్నారు. రాఘవరెడ్డి మాత్రం అటవీశాఖ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేశాడు. అలాగే కేసు పెట్టమని స్థానిక పోలీసులను ప్రాధేయపడ్డాడు. ఎంతకీ స్పందన లేకపోవడంతో ఎమ్మిగనూరు కోర్టులో ప్రైవేటు కంప్లైంట్ వేశాడు. కోర్టు సీరియస్‌గా తీసుకుని చెట్లను నరికిన వ్యక్తులపై కేసు నమోదు చేయాలని మంత్రాలయం పోలీసులకు ఆదేశించింది. నాలుగు నెలల తర్వాత సోమవారం మంత్రాలయం పోలీసులు.. చెట్లు నరికిన కురువ లింగన్న, కురువ మల్లయ్య, కురువ రామచంద్ర, కురువ లింగన్న, కురువ గడ్డం భీమయ్యపై కేసు నమోదు చేయడంతో ఫిర్యాదు దారుడు సంతోషం వ్యక్తం చేశాడు.

మృతదేహం లభ్యం

కొత్తపల్లి: మండలంలోని ముసలిమడుగు గ్రామ పొలిమేరలోని పొలాల్లో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ ఎం.కేశవ తెలిపిన వివరాలు.. మృతదేహం పడి ఉందని రైతుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం కుళ్లిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉందని, తలారి మద్దిలేటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

గడ్డివాములు దగ్ధం

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని ఈర్నపాడు గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రైతుకు బద్రి చంద్రకాంత్‌కు చెందిన రెండు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. మంటలను గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని పక్కనున్న గడ్డి వాములకు మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. ప్రమాదవశాత్తూ జరిగిందా, ఆకతాయిల పనేనా అనే విషయం తెలియాల్సి ఉంది.

ఎన్‌ఎంఎంఎస్ తుది కీ విడుదల

కర్నూలు సిటీ: ఈ నెల 8న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ఫలితాల తుది కీ విడుదల చేసినట్లు డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9న ప్రైమరీ కీ విడుదల చేసి, 16 వరకు వెబ్‌సైట్ ద్వారా అభ్యంతరాలు స్వీకరించినట్లు తెలిపారు. వీటి ఆధారంగా ఫైనల్ కీ విడుదల చేశామని పరీక్ష రాసిన విద్యార్థులు చూసుకునేందుకు డీఈఓ ఆఫీస్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

ఉద్యోగం పేరుతో మోసం

- ఏఎస్పీకి బాధితుడి ఫిర్యాదు


అడిషనల్ ఎస్పీకి సమస్యలు చెప్పుకుంటున్న బాధితులు

కర్నూలు: పత్తికొండ ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి కర్నూలుకు చెందిన శ్రావణ్ కుమార్, మధుకిరణ్‌లు కలసి రూ.1.75 లక్షలు తీసుకుని మోసం చేశారని పత్తికొండ మండలం బుగ్గతండా గ్రామానికి చెందిన శివనాయక్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరాకు ఫిర్యాదు చేశారు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఏఎస్పీ హుసేన్ పీరా సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించి నేరుగా వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 93 ఫిర్యాదులు వచ్చాయి. చట్ట పరిధిలో వాటన్నింటిపై విచారణ జరిపించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఏఎస్పీ వారికి హామీ ఇచ్చారు.

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని..

- కుమారులు వృద్ధాప్యంలో ఉన్న తన బాగోగులు పట్టించుకోవడం లేదని, విచారణ జరిపి తగు న్యాయం చేయాల్సిందిగా వెల్దుర్తి మండలం అల్లుగుండు గ్రామానికి చెందిన లలితమ్మ ఫిర్యాదు చేశారు.
- గొర్రెల ఫామ్, వ్యాపారానికి సంబంధించిన లోన్‌తో పాటు స్కూల్ డెవలప్‌మెంట్ నిధులు ఢిల్లీకి చెందిన బ్యాంకు నుంచి ఇప్పిస్తానని నకిలీ ఫొటోలు చూపించి కర్నూలుకు చెందిన విజయ్ అలియాస్ మసిపోగు మారెన్న కొంతమందితో డబ్బులు తీసుకుని మోసాలు చేస్తున్నాడని కల్లూరుకు చెందిన వీరేష్ ఫిర్యాదు చేశాడు.
- జొన్న పంటను దున్నించి తనకు నష్టం చేశాడని పత్తికొండ మండలం పుచ్చకాయలమాడ గ్రామానికి చెందిన సుంకేసులు ఫిర్యాదు చేశాడు.
- తన రెస్టారెంట్‌లో పనిచేసే ప్రదీప్ అనే వ్యక్తి తన మొబైల్‌ను తీసుకువెళ్లి అందులో రూ.82 వేలు ఫోన్‌పే ద్వారా మహారాష్ట్ర గ్రామీణ బ్యాంకుకు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నాడని ఆదోని శ్రీనివాస భవన్ రెస్టారెంట్ యజమాని చైతన్య ఫిర్యాదు చేశారు.
- అనారోగ్యంతో ఉన్న కొంతమందికి జీవిత బీమా ఇప్పిస్తామని చెప్పి ఎల్‌ఐసీలో పనిచేసే కొందరు మోసాలకు పాల్పడుతున్నారని కర్నూలుకు చెందిన శివకుమార్ ఫిర్యాదు చేశారు.

ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు ఆద్యులు పీవీ


పీవీ చిత్రపటం ముందు నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ నేతలు

కర్నూలు(అర్బన్): భారత దేశ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులకు ఆద్యులు భారతరత్న స్వర్గీయ పీవీ నరసింహారావు అని నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సండేల్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం పీవీ వర్ధంతి సందర్భంగా స్థానిక కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి బ్రాహ్మణ నేతలు పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సండేల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ 1991 నుంచి 1996 వరకు దేశ 9వ ప్రధానిగా పనిచేసిన పీవీ బహు భాషా వేత్త, రచయిత అన్నారు. 1957లో రాజకీయ జీవితం ప్రారంభించిన పీవీ రాష్ట్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానమంత్రిగా పనిచేశారన్నారు. ఆయన ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో తగిన సంఖ్యా బలం లేని మైనారిటీ ప్రభుత్వాన్ని తన రాజకీయ చతురతతో పూర్తి కాలం నడిపించారన్నారు. బ్రాహ్మణుడైన పీవీ కులపరంగా బలమైన రాజకీయ వర్గం లేకపోయిన తనకున్న తెలివితేటలు, రాజకీయ అనుభవంతో దేశ రాజకీయ చిత్రపటంలో తనదైన ముద్ర వేసుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు చెరువు వెంకటదుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి చల్లా నాగరాజుశర్మ, ఉపాధ్యక్షులు కంచుగంటల శ్యాంసుందర్‌రావు, ఉప కార్యదర్శి నాగులవరం రాజశేఖర్‌రావు, గౌరవ సలహాదారులు సముద్రాల శ్రీధర్‌బాబు, బ్రాహ్మణ నేతలు టీవీ రవిచంద్రశర్మ, శ్రీనివాసరాజు, రాధాక్రిష్ణ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ కళా పరిషత్ పోటీలకు ‘శ్రీకృష్ణ కమలపాలిక’

కర్నూలు కల్చరల్: ఎన్టీఆర్ కళా పరిషత్ నాటక పోటీలకు కర్నూలు టీజీవీ కళాక్షేత్రం వారి ‘శ్రీకృష్ణ కమలపాలిక’ పద్య నాటకం ఎంపికైందని కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. జనవరి 18 నుంచి 30వ తేదీ వరకు ఒంగోలులోని ఈదర హరిబాబు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని నాటిక, సాంఘిక, పౌరాణిక నాటక పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా శ్రీకృష్ణ కమల పాలిక నాటకం ఎంపికైనట్లు నిర్వాహకులు సమాచారం ఇచ్చారని తెలిపారు. ఈ నాటకం జనవరి 19వ తేదీ సాయంత్రం 7 గంటలకు ప్రదర్శితమైతుందని పేర్కొన్నారు. పల్లేటి కులశేర్ రచనలో, పత్తి ఓబులయ్య దర్శకత్వంలో ఈ నాటకం ఇప్పటికే పలు పోటీల్లో పాల్గొని ఉత్తమ నాటక అవార్డులు కై వసం చేసుకుంది. రాయలసీమ జిల్లాల నుంచి ఎంపికైన ఏకైక నాటకం కావటం విశేషం.

చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి


స్టాల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించి చేనేత కార్మికులకు చేయూతను అందించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా బనగానపల్లె మండలం, నందివర్గ గ్రామ చేనేత స్టాల్‌ను ప్రారంభించి అధికారులందరిచే చేనేత వస్త్రాలను కొనుగోలు చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చేనేత వస్త్రాలను ప్రతివారం ధరించాలని ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసిందని ఈ మేరకు ప్రభుత్వ ఉద్యోగులందరూ చేనేత వస్త్రాలు ధరించి చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించాలన్నారు.

టెర్రస్ గార్డెనింగ్‌కు పురస్కారం

కర్నూలు(అగ్రికల్చర్): ఆర్గానిక్ టెర్రస్ గార్డెనింగ్‌లో విశేషంగా రాణిస్తున్న గుజరాతీ ఎల్లప్ప, సుష్మ దంపతులకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక పురస్కారం లభించింది. ఈ దంపతుతు స్థానిక లక్ష్మీనగర్‌లో ఇంటిపై కప్పుపై దాదాపు 650 చదరపు అడుగుల విస్తీర్ణంలో 50కిపైగా రకాలతో 250 మొక్కలతో మిద్దెతోటను ఏర్పాటు చేసుకున్నారు. ఎలాంటి కెమికల్స్ వాడకుండా పూర్తిగా పశువుల ఎరువులు, చెరువుమట్టి, వర్మీకంపోస్టు, కిచెన్ వ్యర్థాలను వినియోగిస్తూ నాణ్యమైన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు ఉత్పత్తి చేస్తున్నారు. అన్ని రకాల కూరగాయలు, ఆకు కూరలు, పూలు, ఔషధ మొక్కలతో పాటు మిద్దెపైనే జామ, అంజూర, స్టార్‌ఫ్రూట్స్, మల్బరీ, అరటి వంటి పండ్ల చెట్లను కూడా పెంచారు. పనికి రాని ప్లాస్టిక్ డబ్బాలు, ఖాళీ సంచులు, డ్రమ్ములు తదితర వాటిని మొక్కలు నాటేందుకు వినియోగిస్తున్నారు. మూడేళ్లుగా కుటుంబానికి అవసరమైన కూరగాయలను ఇంటిపైనే పండించుకుంటున్నారు. మిద్దెతోటలో విశేషంగా రాణిస్తున్న ఎల్లప్ప, సుష్మా దంపతులకు రైతుసేస్తం అవార్డు లభించింది. సోమవారం గుంటూరులో జరిగిన కార్యాక్రమంలో డీజీపీ ద్వారకా తిరుమలరావు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు, ప్రముఖ మిద్దెతోటల నిపుణులు తుమ్మేటి రఘోత్తమరావు నుంచి వారు అవార్డు అందుకున్నారు.

తామ్ర శాసనాల పరిశీలన


తామ్ర శాసనాలను పరిశీలిస్తున్న పురావస్తు శాఖ అధికారులు

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని ఘంటా మఠం వద్ద 2017– 2020 మధ్యకాలంలో జరిగిన జీర్ణోద్ధరణ పనుల సందర్భంగా లభ్యమైన తామ్ర శాసనాలను పురావస్తు శాఖ అధికారులు సోమవారం పరిశీలించారు. అప్పట్లో బంగారు, వెండి నాణేలు, విలువైన బంగారు కంకణాలతోపాటు 53 తామ్ర శాసనాలు లభ్యమయ్యాయి. వాటిని దేవస్థానం అధికారులు భద్రపరిచి పురావస్తు శాఖ అధికారులకు తెలియజేశారు. వారు అప్పట్లో ఆలయానికి చేరుకుని ఫొటోలు తీసుకెళ్లి తెలుగుకి తర్జుమా చేశారు. ఈక్రమంలో శాసనాలను మరోసారి పరిశీలించి తర్జుమా చేసిన తెలుగు భాషలో ఏవైనా పొరపాట్లు ఉన్నాయేమోనని సరిచూసుకోవడానికి పురావస్తు శాఖ నిపుణుల బృందం సభ్యులు ఎంవీఆర్ వర్మ, శ్రీనివాసరావు వచ్చినట్లు ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ బాలమురళి, ఉప స్థపతి జవహర్ పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సు ఢీకొని 9 గొర్రెలు మృతి

హాలహర్వి: మండలంలోని ఆంధ్ర–కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో సోమవారం రాత్రి ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు గొర్రెల మందపై దూసుకెళ్లింది. ప్రమాదంలో 9 గొర్రెలు మృతిచెందాయి. గొర్రెల కాపరులు తెలిపిన వివరాలు.. ఆదోని నుంచి బళ్లారి వైపు వెళ్తున్న మీనాక్షి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ రోడ్డుపై ఓ పక్కన వెళ్తున్న గొర్రెలను ఢీకొట్టాడన్నారు. అంతటితో ఆగకుండా వెళ్లిపోయాడన్నారు. ఒక్కో గొర్రె రూ.20 వేల చొప్పున ధర పలుకుతుందని, దాదాపు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని గొర్రెల కాపరి వాపోయాడు. నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరాడు.



సామాజిక బాధ్యత కలిగి ఉండాలి

కర్నూలు కల్చరల్: యువత సామాజిక బాధ్యత కలిగి ఉండాలని రాయలసీమ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. సోమవారం మాదక ద్రవ్యాల నివారణకు సంబంధించి వర్సిటీలో విద్యార్థులకు వ్యాసరచన, లఘుచిత్రాలు, ఇన్‌స్టాగామ్ రీల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పోటీలను పరిశీలించిన వీసీ మాట్లాడుతూ.. వర్సిటీ, అనుబంధ కళాశాలల విద్యార్థులకు ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించామన్నారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం, మానవ అక్రమ రవాణా, గుడ్ టచ్ – బ్యాడ్ టచ్, ర్యాగింగ్, బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.హరిప్రసాద్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కె.వెంకటరత్నం, డాక్టర్ బి.విజయుడు, డాక్టర్ నాగచంద్రుడు, శివప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టళ్లకు రూ.6.74 కోట్ల బడ్జెట్ విడుదల

కర్నూలు(అర్బన్): జిల్లాలోని బీసీ వసతి గృహాలకు డైట్, కాస్మోటిక్ చార్జీలకు సంబంధించి 3,4 క్వార్టర్లకు ప్రభుత్వం రూ.6.74 కోట్ల బడ్జెట్‌ను విడుదల చేసినట్లు జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారిణి వెంకటలక్షుమ్మ తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మొత్తం 28 ప్రీమెట్రిక్ హాస్టళ్లకు 3వ క్వార్టర్ డైట్ చార్జీలకు 2,54,24,500, కాస్మోటిక్ చార్జీలకు రూ.14,43,900, అలాగే 4వ కార్వర్టర్ డైట్ చార్జీలకు రూ.2,39,77,700, కాస్మోటిక్ చార్జీలకు రూ.20,84,600 విడుదలయ్యాయని తెలిపారు. మొత్తం 14 పోస్టు మెట్రిక్ వసతి గృహాల్లోని విద్యార్థులకు సంబంధించి 3వ క్వార్టర్ కాస్మోటిక్ చార్జీలకు రూ.47,24,800, 4వ క్వార్టర్ డైట్ చార్జీలకు రూ.91,10,600, కాస్మోటిక్ చార్జీలకు రూ.6,79,100 విడుదలయ్యాయని చెప్పారు. కాస్మోటిక్ చార్జీలు 3 నుంచి 6వ తరగతి వరకు బాలురకు నెలకు రూ.130, బాలికలకు రూ.110, 7 నుంచి 10వ తరగతి వరకు బాలురకు రూ.155, బాలికలకు రూ.160 చెల్లించడం జరుగుతుందన్నారు. అలాగే ప్రీమెట్రిక్ వసతి గృహాల్లోని విద్యార్థులకు బాలికలకు నెలకు రూ.160, బాలురకు రూ.155 ప్రకారం ప్రభుత్వం విడుదల చేస్తోందన్నారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

కల్లూరు: ఈతకు వెళ్లి విద్యార్థి మృతి చెందిన ఘటన ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి కళాశాలలో బేతంచర్ల మండలం ముద్దవరం గ్రామానికి చెందిన రాంప్రసాద్ రెడ్డి (19) బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం పెద్ద టేకూరులో బావిలో ఈతకు వెళ్లి మృతిచెందాడు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నట్లు ఉలిందకొండ ఎస్‌ఐ ధనుంజయ తెలిపారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో నలుగురు డిబార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ పరీక్షల్లో భాగంగా సోమవారం నిర్వహించిన మొదటి సెమిస్టర్ పరీక్షల్లో నలుగురు డిబార్ అయ్యారు. గూడూరు ఎస్‌ఆర్ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో 4, డోన్ సాయి శ్రీ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో ఒకరు చూచిరాతకు పాల్పడగా మొత్తం నలుగురు విద్యార్థులను డిబార్ చేసినట్లు తెలిపారు. మొదటి సెమిస్టర్ పరీక్షలకు 10,876 మందికి 9,616 మంది హాజరు కాగా 1260 మంది, మూడు, ఐదో సెమిస్టర్ల పరీక్షలకు 5,086 మందికి 4,600 మంది హాజరు కాగా 486 మంది గైర్హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 61 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయి. కర్నూలు నగరంలోని శంకరాస్ డిగ్రీ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య ఎన్‌టీకే నాయక్, సీఈ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లుతో కలిసి సందర్శించి పరిశీలించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

- నిందితులకు నెల జైలు శిక్ష, రూ.600 జరిమానా
- ఆరునెలలు ఎక్కడా పేకాట ఆడకుండా బైండోవర్

సాక్షి ఎఫెక్ట్

ఆళ్లగడ్డ: పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరపరచగా ఒక్కొక్కరికి నెల జైలు శిక్షతో పాటు రూ.600 జరిమానా విధించిన సంఘటన సోమవారం ఆళ్లగడ్డలో చోటు చేసుకుంది. విశ్వసనీయ సమాచారం మేరకు నియోజకవర్గంలో జోరుగా పేకాట జరుగుతోందన్న విషయంపై సాక్షి దినపత్రికలో ఈ నెల 14వ తేదీ ‘రోజుకో చోట.. మూడు ముక్కలాట!’ అన్న శీర్షికతో కథనం వెలువడింది. దీన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంబగిరిరాముడు ప్రత్యేక టీం ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో చాగలమర్రి శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో శిబిరంపై దాడులు చేయగా పేకాటఆడుతూ 9 మంది పట్టుపడ్డారు. వీరిలో దూదేకుల నాగబ్రహ్మం (ఇంజేడు), దూదేకుల దస్తగిరి (కొండంపల్లె), దేశం సుధాకర్‌రెడ్డి (కర్నూలు టౌన్ గుంతనాల), కోట శేఖర్ (సర్వేపల్లి), నాగపురుషోత్తం (ముత్తలూరు), సుధాకర్ (నంద్యాల టౌన్ బొగ్గులైను), యూసఫ్ (నంద్యాల టౌన్ మూలసాగరం), అనిల్‌కుమార్ (చాగలమర్రి)లను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి కోవెలకుంట్ల కోర్టులో హాజరుపరచగా విచారించిన జడ్జి వారికి రెండు వారాల జైలు శిక్ష, రూ 500 జరిమానా, పేకాట శిబిరం దగ్గర న్యూసెన్స్ చేసినందుకు మరో రెండు వారాలు జైలు శిక్ష, రూ.100 జరిమానా విధించారు. మొత్తం ఒక్కొక్కరికి నెల జైలు శిక్ష, రూ.600 జరిమానా విధించారని సీఐ తెలిపారు. ఆరు నెలలు ఆళ్లగడ్డ పరిసర ప్రాంతాల్లో పేకాట ఆడబోమని మెజిస్ట్రేట్ ముందు రూ.లక్ష రూపాయల పూచికత్తుతో బైండోవర్ చేశారు. మరోసారి పేకాట ఆడుతూ పట్టుపడితే కఠిన శిక్షతో పాటు రూ.లక్షల జరిమానా చెల్లించాల్సి వస్తుందని సీఐ తెలిపారు